# వెలితి

మల్లాది రమాంజలి




తీరికగా బాల్కనీలో కూర్చుంటే రకరకాల దృశ్యాలు, రకరకాల డ్రస్సుల్లో రంగురంగుల సీతాకోక చిలుకల్లా స్కూలు పిల్లలు, తోపుడు బండిపై కూరలమ్మే చిన్న వ్యాపారులు, ఎదురుగా కడుతున్న కొత్త బిల్డింగ్ దగ్గరలో నివాసం ఏర్పాటు చేసుకున్న కూలిజనం... ఎన్నో కుటుంబాలు.. రకరకాలుగా బ్రతుకు వెళ్లదీసే వాళ్లు...

అలవాటుగా ఎడమవైపు దృష్టి సారించాను. అక్కడ కూలి కోసం కొత్తగా వచ్చిన ఓ జంట. వాళ్లుండేది చిన్న గుడిసె.. దగ్గర్లో మూడు రాళ్ల పొయ్యి, నాలుగు కుండలు, నాలుగు స్టీలుగిన్నెలు, నాలగు ప్లేట్లు, రెండు ప్లాస్టిక్ కడవలు... ఆమెకు ప్రతి పనిలోనూ సాయం చేస్తాడతడు. వాళ్లు తినేది గంజి అన్నమైనా పక్కన పక్కన కూర్చుని నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ తింటారు. ఒకరికొకరు ముద్దలు నోట్లో పెట్టుకుంటారు. వారికి 'డబ్బు' అనే వెలితి ఉన్నా ఎంత సంతోషంగా ఉన్నారు? తన మనసులోని వెలితికి కారణం ఏమై ఉంటుంది?

"అమ్మగారూ! ఈరోజు వంట ఏం చేయమంటారు?" వంటమనిషి అన్నపూర్ణ ప్రశ్నించింది.

నా ఆలోచనలు దారాల్లా తెగిపోయాయి.

"ఏదో ఒకటి చెయ్యి పూర్ణా! అయ్యగారు కేంపుకెళ్లారు కదా" నిరాసక్తతగా అన్నాను.

పూర్ణ వెంటనే అక్కడి నుంచి కదిలింది. వంట గదిలోనుంచి ఆమె తీసే కూనిరాగాలు, ఆ వెనుక వంట తాలూకు ఘుమఘుమలు నా వరకూ వస్తున్నాయి. పూర్ణ నెలకు రెండు వేలు తీసుకుని నా ఇంట్లో వంట చేసే మనిషి. భర్త పోతే ఉన్న ఒక్క కొడుకునూ ముద్దుగా పెంచుకుంటోంది. ఆమె మనసులో, బ్రతుకులో కూడా తీరని వెలితి. కానీ అంత ఆనందంగా ఎలా ఉండగలుగుతోంది? ఏమో!

గడిచిపోయిన నా గతంలోకి తొంగి చూస్తే-

అమ్మా, నాన్నా, తనూ, తమ్ముళ్లు, చెల్లెళ్లు- అదో పెద్ద కుటుంబం.. చాలీ చాలని సంపాదన... వారంలో ఓ రోజు కడుపు నిండేది. రోజూ అర్ధాకలే. అమ్మ ముఖంలో ఏదో వెలితి. నాన్న ముఖంలో అసహనం. నిర్లిప్తత. నిస్సహాయత. నాన్నకు తెలీకుండా అమ్మ నలుగురికీ తనకు చేతనైన సాయం చేసి నాలుగు డబ్బులు సంపాదించేది. అమ్మ కష్టం చూస్తుంటే నా మనసు మూలిగేది. నాన్న మమ్మల్ని కాలు బయటపెట్టనిచ్చేవారు కాదు. చాటుగా 'బంగార్రాజు' గారింటికి వెళ్లి మజ్జిగ పోయించుకు రమ్మనేది అమ్మ. దారిలో నాన్న దూరంగా కనపడితే మరోదారిగుండా ఇంట్లోకి వచ్చి చాటున నక్కేదాన్ని. ఇల్లంతా ఎటు చూసినా దరిద్రం తాండవిస్తూ ఉండేది. గలేబులు లేని తలగడలూ, మాసికలు పడిన బట్టలూ, చిరుగుల దుప్పట్లూ, చింకి చాపలూ...

ముఖానికి సువాసనలు వెదజల్లే పౌడర్లు రాసుకోవాలనీ, రంగురంగుల తిలకాలు పెట్టుకోవాలనీ, పచ్చమేడలోని భవానిలా సిల్కు రిబ్బన్లు పెట్టుకోవాలనీ, పట్టు పావడాలు కట్టుకోవాలనీ ఎన్నో ఆశలు... కానీ అవన్నీ అందని ద్రాక్షపళ్లే... ముఖం తెల్లగా ఉండాలని గోడ సున్నం రాసుకునే వాళ్లం.. మా కోరికలు తీర్చలేని అమ్మ చాటుగా కళ్లొత్తుకునేది.

"పంతులుగారూ! మీ పెద్దమ్మాయి కుందనపు బొమ్మలా వుంటుందండీ... మాకు తెలిసిన మంచి కుటుంబం ఒకటుంది...వాళ్లంతా జమీందారీ స్థాయిలో ఉంటారు. అమ్మాయినిస్తే ఆ బంగ్లాలో రాణీలా వెలిగిపోతుంది.. మాట్లాడమంటారేమిటి" నాన్నగారికి బంగార్రాజో సలహా ఇచ్చాడు.

"నిజమే రాజూ! అమ్మాయి బొమ్మలా ఉంటుంది. కానీ కట్నం ఎక్కడి నుంచి తేగలను?" నాన్న మాటల్లో నిరాశ.

"మీరు ఊ...అనండి. నేను మాట్లాడతాను" బంగార్రాజు హామీ ఇచ్చాడు.


అమ్మను, నాన్నను వదిలి వెళ్లాలంటే బాధగా, భయంగా ఉంది. పిల్లలంతా చిన్నవాళ్లు, అమ్మకు నేను సహాయంగా ఉండేదాన్ని. రాత్రయ్యేసరికి పిల్లలంతా నా పక్కనే చేరేవాళ్లు. వాళ్లందరికీ గోరుముద్దలు తినిపించి, కథలూ కబుర్లూ చెప్పి, నిద్రపుచ్చేదాన్ని. అదో రకమైన ఆనందం, మంచి నీళ్లతో సగం కడుపునింపుకున్నా మాసికలు పడ్డ బట్టలు వేసుకున్నా ఆ వెలితి తెలిసేది కాదు. తమ్ముళ్లు, చెల్లెళ్లతో కాలం ఇట్టే గడిచిపోయేది. సాయంత్రమయ్యేసరికి వాళ్లందర్నీ ఓ దగ్గర చేర్చి చదువు చెప్పేదాన్ని. పెరట్లో పూసిన మల్లెపూలతో జడలు కుట్టేదాన్ని. ఆ రోజుల్లో ఆ ఆనందమే వేరు. ఇప్పుడు ఇంద్రభవనం లాంటి బంగ్లాలో ఉన్నా, బంగారు పంజరంలో ఉన్న ఫీలింగ్... ఏదో లోటు, ఏదో వెలితి, ఏదో ఒంటరితనం... ఏదో అసంతృప్తి... అప్పుడు డబ్బు లేదని అసంతృప్తి.. ఇప్పుడు డబ్బున్నా అసంతృప్తి... దీనికి కారణం?

నా ఆలోచనలు రోజూ ఈ రకంగానే సాగుతూ ఉంటాయి. ఆయనకు తెలిసి కొంత, తెలీక కొంత అమ్మకు ఏదో ఓ రూపేణా సహాయం చేస్తూనే ఉన్నాను. నా వల్ల వాళ్ల జీవన విధానంలో కూడా కొంతలో కొంత మార్పు వచ్చింది. ఏ మూల చూసినా దరిద్రం తాండవించే ఆ ఇంట్లో ఇప్పుడు కొంత మార్పు చోటు చేసుకుంది.

"అమ్మా! వంటపని అయిపోయింది.. ఇక నేను వెళ్లొచ్చా?" అన్నపూర్ణ చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"అన్నపూర్ణా! నీకు అభ్యంతరం లేకపోతే... అయ్యగారు వచ్చేవరకూ నాకు తోడుంటావా?"

పూర్ణ నావంక ఆశ్చర్యంగా చూసింది. ఆ తర్వాత- "అలాగేనమ్మా" అంటూ తలూపి, మరో బాల్కనీలో ఆడుకుంటున్న తన కొడుకును తీసుకొచ్చి, గుప్పెడన్నం పెట్టి, ఆ తర్వాత వాడిని ఒళ్లో వేసుకుని నేను భోజనం చేసే వరకూ నా దగ్గరే కూర్చుంది పూర్ణ.



ఆయనకెప్పుడూ బిజినెస్ టూర్స్ ఉంటూనే ఉంటాయి. నెలకో పది రోజులు నాకీ ఒంటరితనం తప్పదు. ఆయన ఊళ్లో ఉన్నన్ని రోజులూ సినిమాలకు, షికార్లకూ వెళుతూ రోజులు క్షణాల్లా గడిపేస్తాం. ఆయన ఊళ్లో లేనప్పుడు నా మనసు, నా ఇల్లు మూగగా నిశ్శబ్దంగా ఉంటాయి.

“అమ్మా! మీకు ధనధాన్యాలకు లోటులేదు. కానీ మీ కళ్లల్లో ఏదో వెలితి... ఎన్నాళ్లుగానో గమనిస్తున్నాను. ఆడదాని మనసు మరో ఆడదానికే తెలుస్తుంది. ఈ మాట మిమ్మల్ని అడగవచ్చో లేదోనని...” అర్థోక్తిలో ఆగిపోయింది పూర్ణ.

ఓ నిమిషం పూర్ణ కళ్లల్లోకి చూసాను. ఆ క్షణంలో నా మనసును, నా అలజడిని ఆమె ముందు పరిచాను.



“నిరుపేద కుటుంబం నుంచి వచ్చాను. రోజులకొద్దీ అర్ధాకలితో గడిపేవాళ్లం. తమ్ముళ్లు.. చెల్లెళ్లు.. వాళ్ల ఆలనాపాలనా రోజులు ఇట్టే గడిచిపోయేవి. డబ్బు లేదనే లోటు తప్ప ఏ వెలితీ తెలిసేది కాదు. ఒంటరితనం భయపెట్టేది కాదు. కానీ ఓ ఇంటిదాన్నయినా- డబ్బుకు లోటు లేకపోయినా- ప్రేమానురాగాలు పుష్కలంగా లభించినా- ఒంటరితనపు భయం, ఏదో వెలితి... ఏదో అసంతృప్తి నన్ను వెన్నాడుతున్నాయి పూర్ణా...”

నా మనసు అర్థమైనట్టు ఓ నవ్వు నవ్వింది పూర్ణ.

“అమ్మా! మీ బాధ నాకర్థమైంది. మీరో ఇంటివారు కాక పూర్వం మీ తోడబుట్టిన వారి ఆలనా పాలనా, మీ అమ్మకు సహాయం, అమ్మ బాధలో సగం పంచుకుంటూ గడిపిన మీ జీవితం క్షణం తీరిక లేకుండా గడిచింది. ఇప్పుడు మీ జీవితం ఓ ఆనందాల పూల నావ.. డబ్బుకు, సంతోషానికీ లోటు లేకపోయినా మీ మనసు మీ అదుపు తప్పుతోంది. తీరిక సమయం, ఒంటరితనం మిమ్మల్ని పీడిస్తున్నాయి. నా భర్త పోయిన కొత్తల్లో నేనెంతో ఒంటరితనాన్ని అనుభవించాను. దారీతెన్నూ లేక పిచ్చిదాన్నయ్యాను. కానీ నన్ను నేను పోషించుకోవడమే కాకుండా నా మీద ఆధారపడిన నా బిడ్డను కూడా పోషించుకోవాలి కదా! ధైర్యాన్ని కూడదీసుకుని- నాకొచ్చిన వృత్తిని చేపట్టి ఉన్నంతలో ఆనందంగా ఉండగలుగుతున్నాను. నాతో పోలిస్తే- మీకు దేనికి లోటమ్మా? గడిచిన జీవితం డొంకదారిలో నడిచినా, ఇప్పుడు పూలదారిలో నడుస్తున్నారు. పేదల బ్రతుకులు ఎంత దుర్భరమో మీకు తెలుసు. నాలా దారి తెలీని వారికి మీ చేయూత నివ్వండి. అనాథల, అభాగ్యుల కష్టం, సుఖం కనుక్కోండి... మీకు చేతనైన సాయం చేయండి. అందులో మీకు పూర్తి సంతృప్తి దొరుకుతుందమ్మా! అప్పుడు మీకు ఏ వెలితీ, ఏ ఒంటరితనం దరిచేరవు... మీ జీవితానికో సంపూర్ణత చేకూరుతుంది”

అన్నపూర్ణ మాటలు నా మనసు లోతుల్లో చేరి నన్ను ఆలోచింప చేస్తున్నాయి.